సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం । 16 । జూన్ । 2023



అన్నదాతలూ..అప్రమత్తం

అన్నదాతలు కోటి ఆశలతో వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో నకిలీ విత్తనాల బెడద వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

- 8లో▸



రాష్ట్రంలో ప్రగతి పరుగులు

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతి పరుగులు తీస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

41.0⁰/31.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే వేడి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

చదివింపులే..!

'ప్రైవేట్'లో తడిసిమోపెడవుతున్న ఫీజులు

- ఎల్‌కేజీ రూ.15వేలు.. టెన్త్‌కు రూ.40వేలు
- ఇంగ్లిష్ మీడియంపై మక్కువతో తల్లిదండ్రుల ఆసక్తి



భూపాలపల్లి అర్బన్: తమ కంటే చదువు రాక పాయె.. కడుపున పుట్టినోళ్లకయినా నాలుగు అక్షరాలు నేర్పించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల విద్య వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంగ్లిష్ మీడియం అయితేనే పిల్లలకు భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. దీనిని విద్యాసంస్థలు ఆసరాగా తీసుకుంటున్నాయి. దీంతో తల్లిదండ్రులకు ఫీజులు తడిసిమోపెడవుతున్నాయి. నోట్ పుస్తకాల దగ్గరి నుంచి పెన్ను, పెన్సిల్ వరకు ప్రైవేట్‌లోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తుండడంతో డబ్బులు అధికం అవుతున్నప్పటికీ పేరెంట్స్‌కు తప్పడం లేదు.

జిల్లాలో 71ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక, హైస్కూల్ స్థాయిల్లో నడుస్తున్నాయి. సుమారు 23వేల మంది విద్యార్థులు వీటిల్లో విద్యను అభ్యసిస్తున్నారు. అడ్మిషన్ ఫీజులు మొదలుకొని అనేక రకాలుగా దోచుకుంటున్నారు. ఎల్‌కేజీ విద్యార్థులకు సగటున రూ.15వేలు, పదోతరగతి విద్యార్థులకు రూ.40 వేలు ఫీజు తీసుకుంటున్నారు. వీటితో పాటు పాఠశాలల్లోనే పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు కూడా కొనుగోలు చేయాలనే నిబంధనలు పెడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో అవే పుస్తకాలు 10 నుంచి 15శాతం తగ్గింపు ధరతో దొరుకుతున్నాయి. ఈ అమ్మకాల విషయంలో కూడా పాఠశాల యాజమాన్యాలు కమీషన్లకు కక్కుర్తి పడుతున్నాయి. పుస్తకాలు, నోటు బుక్కులతో పాటు పెన్ను నుంచి పెన్సిల్ వరకు బ్యాడ్జీ నుంచి స్కూల్ డ్రెస్సు, స్కూల్ షూస్ కూడా పాఠశాలలోనే కొనుగోలు చేయాలి. వీటన్నింటితోపాటు పాఠశాల గుర్తింపు కార్డుకు ప్రత్యేక రుసుంతో అమ్మకాలు సాగిస్తున్నారు. పుస్తకాలకు 1 నుంచి 10వ తరగతి వరకు రూ.2వేల నుంచి 6వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది.

కనీస సౌకర్యాలు కరువు..

విద్యార్థులు చదువుకునే పాఠశాల గదుల్లో వెలుతురు, గాలితో పాటు శుభ్రత ఉండాలి. జిల్లాలో చాలా పాఠశాలల్లో రేకుల గదులే తరగతి గదులుగా కొనసాగుతున్నాయి. వెలుతురు లేకపోగా.. ఫ్యాన్లు కూడా సక్రమంగా తిరగని పరిస్థితి ఉంది. మెజార్టీ పాఠశాలల్లో పిల్లలు ఆడుకోవడానికి గ్రౌండ్ లేదు. పిల్లలను ఉదయం 7నుంచి సాయంత్రం 7 గంటల వరకు పాఠశాల గదుల్లో యాజమాన్యాలు బందిస్తున్నాయి. దీంతో విద్యార్థుల్లో మానసిక వికాసం తగ్గిపోతుందని మానసిక వికాస నిపుణులు అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు. పాఠశాల ఏర్పాటు చేసే సమయంలో ఆటలు ఆడించటానికి అన్ని వసతులు ఉన్నట్లు అనుమతులు తీసుకుంటారు. కానీ ఏ ఒక్క పాఠశాలకు ఆటస్థలం ఉన్న పరిస్థితి జిల్లాలో కనిపించడం లేదు.

రవాణాకు అదనంగా..

విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలలకు చేర్చడానికి ఏడాదికి రూ.10వేల నుంచి 12వేల వరకు యాజమాన్యాలు రవాణా ఖర్చులకింద వసూలు చేస్తున్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా అన్ని విద్యాసంస్థలు ఇదే విధానం పాటిస్తున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆటోలు, మినీవ్యాన్‌లను అద్దె పద్ధతిలో ఏర్పాటు చేస్తున్నాయి. ఆయా వాహనాలకు చెల్లింపులు పోను లాభం మిగుల్చుకోవడానికి ట్రాన్స్‌పోర్ట్ ఫీజును అధికంగా వసూలు చేస్తున్నారు.

పేరుకే పేరెంట్స్ కమిటీలు..?

ప్రతి పాఠశాలకు ఒక పేరెంట్స్ కమిటీ ఉండాలి. పాఠశాల యాజమాన్యాలు మాత్రం వారికి అనుకూలమైన వారిని పెట్టుకొని పేరెంట్స్ కమిటీలను కాగితాలకే పరిమితం చేస్తున్నాయి.

నిబంధనలు ఇవీ..

- ప్రైవేట్ పాఠశాలల్లో వసతులకు సరిపడా తరగతి గదులు ఉండాలి
- భవన నిర్మాణ నాణ్యత ధృవీకరణ పత్రం ఉండాలి
- విద్యార్థుల మానసిక ఎదుగుదల కోసం ఆటస్థలం, లైబ్రరీ, ప్రహారి, అగ్నిమాపక శాఖ జారీ చేసిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఉండాలి
- తాగునీటి వసతి, ప్రథమచికిత్స, కంప్యూటర్ గది, సిబ్బంది గది, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఖచ్చితంగా ఉండాలి.
- విద్యాహక్కు చట్టం ప్రకారం బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన వారు బోధన చేయాలి.
- తరగతి గదుల్లో అవసరమైనంత వెలుతురు ఉండాలి.
- పిల్లలు రోడ్డు దాటడానికి సౌకర్యం కల్పించాలి.
- పోషకుల కమిటీ, ఫీజు వివరాలు నోటీసు బోర్డు పై అతికించటం, ప్రభుత్వ పుస్తకాలతోనే విద్యాబోధన చేయటం, ఒక తరగతి గదిలో 40 మంది విద్యార్థులు దాటితే మరో సెక్షన్ కోసం అనుమతి తీసుకోవటం, ప్రీ ప్రైమరీ కోసం అనుమతి తీసుకోవటం, తదితర వసతులు ఉండాలి.

నిబంధనలు పాటించాల్సిందే..



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించుకోవాలి. ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ప్రైవేట్ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– రాంకుమార్, ఇన్‌చార్జ్ డీఈఓ

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



మల్హర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని డీఈఓ రాంకుమార్ అన్నారు. మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ పాఠశాలలోని వసతులను పరిశీలించి సంతోషం వ్యక్తంచేశారు. విద్యార్థుల నమోదు శాతాన్ని ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులకు మంచి విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'డిస్మిస్ కార్మికులను పట్టించుకోరా..'

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో విధులు నిర్వర్తిస్తూ డిస్మిస్ అయిన తమను సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని డిస్మిస్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిస్మిస్ కార్మికులు జమ్మికుంట రమేష్, మేదర శ్రీనివాస్ మాట్లాడారు. 10నెలలుగా ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకు ఆయా సంఘాల నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పట్టించుకోకపోతే నిరవధిక నిరాహార దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిస్మిస్ కార్మికులు అనిల్, యుగేందర్ పాల్గొన్నారు.

'అండర్ మేనేజర్‌పై చర్య తీసుకోవాలి'

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 8వ గనిలో గురువారం ప్రమాదకర స్థలంలో బ్లాస్టింగ్ చేయాలని ఒత్తిడి తీసుకువచ్చిన గని అండర్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పసునూటి రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి షిఫ్టులో గనిలోని 3వ సీమ్ 20వ లెవల్‌లో రెండు బ్లాస్టింగ్ అయిపోయిన తర్వాత ఫేస్‌లో సుమారు ఆరు మీటర్ల సపోర్ట్ లేకుండా బ్లాస్టింగ్ చేయవద్దని ఓవర్‌మెన్, సర్దార్ చెప్పినప్పటికీ షాట్‌ఫైర్, అండర్ మేనేజర్ బ్లాస్టింగ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సంబంధిత ఓవర్‌మెన్, సర్దార్ ప్రమాదాన్ని గుర్తించి బ్లాస్టింగ్ నిలిపివేశారన్నారు. అధికారులకు బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపై లేదని చెప్పారు. రక్షణ చర్యలు పాటించని అధికారిపై చర్యలు తీసుకోవాలని గని మేనేజర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రసవాలు పీహెచ్‌సీల్లోనే జరిగేలా చూడాలి



మంగపేట: గర్భిణులు ప్రసవాల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా పీహెచ్‌సీల్లోనే జరిగే విధంగా ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగపేట, చుంచుపల్లి పీహెచ్‌సీలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ నిర్వహణ రికార్డులు, వైద్యాధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ఈ నెలలో ప్రసవం కావాల్సిన గర్భిణులు ఎంత మంది ఉన్నారని వైద్యాధికారి స్వప్నితను అడిగి తెలుసుకున్నారు. మంగపేట పీహెచ్‌సీ పరిధిలో 17 మంది, చుంచుపల్లి పీహెచ్‌సీ పరిధిలో 13 మంది ఉన్నారని వైద్యాధికారులు స్వప్నిత, యమున తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాల పరిస్థితిపై వివరాలు, మందుల వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఐదు రోజులుగా ఆయుర్వేదిక్ వైద్యాధికారి సర్వేశం ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్న విషయంపై సంజాయిషీ నోటీసు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీ అయ్యేలా చూడాలని సూపర్ వైజర్ గంగమ్మకు సూచించారు. అనంతరం జ్వరంతో బాధపడుతూ మంగపేట పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న కొత్తపేట గ్రామానికి చెందిన జ్వరపీడితులను ఆయన పరీక్షించి వైద్యం అందించాల్సిన తీరుపై వైద్యాధికారి స్వప్నితకు పలు సూచనలు చేశారు.

తునికాకు బోనస్ చెల్లించాలి



మాట్లాడుతున్న రాజేష్

ములుగు రూరల్: తునికాకు బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గొంది రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోవిందరావుపేట మండల పరిధిలోని పస్రాలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలో మాత్రమే తునికాకు సేకరణదారులకు బోనస్ డబ్బులు అందాయని తెలిపారు. జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు బోనస్ డబ్బులు అందలేదన్నారు. డబ్బుల చెల్లింపు ఆలస్యానికి అటవీశాఖ అధికారులు తగిన సమాధానం ఇవ్వాలని కోరారు. దీంతో పాటు పోడు భూములకు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కోట కృష్ణారావు, ఐద్వా సంఘం నాయకులు మంచాల కవిత, నాగేష్, రమేష్, ప్రభాకర్, రజిత, రాజేశ్వరి, సువర్ణ, రాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కీలకం



జీపీ సిబ్బందిని సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

వెంకటాపురం(ఎం): దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాల అభివృద్ధే కీలకమని అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల పరిధిలోని నల్లగుంటలో తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమానికి గురువారం ఆమె హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక నిధులు కేటాయిస్తూ ప్రతీ పల్లెను అభివృద్ధి చేస్తుందన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సత్కరించి దుస్తులను అదనపు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండల సుచరిత, డీపీఓ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మొగుళ్లపల్లి: పల్లె ప్రగతి ఉత్సవంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి



చిట్యాల: లక్ష్మీపూర్ తండాలో జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: గ్రామాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీపూర్ తండా, కొత్తపేట, చల్లగరిగ గ్రామాలలో రూ.60లక్షల నిధులతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాలలో జాతీయజెండా ఎగురవేసి జాతీయగీతం ఆలపించారు. లక్ష్మీపూర్‌తండాలో పల్లెప్రగతి దినోత్సవం నిర్వహించారు. చల్లగరిగ గ్రామంలో ఆయుష్ ఆస్పత్రిని సందర్శించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గ్రామాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయని తెలిపారు. గత ప్రభుత్వాల పాలనలో పరిస్థితి అధ్వానంగా ఉండేదన్నారు. గ్రామపంచాయతీలుగా మారిన తండాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని సంతోషం వ్యక్తంచేశారు. చల్లగరిగ గ్రామంలోని పంచాయతీ సిబ్బందికి శాలువాతో పాటు ప్రశంస పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీడీఓ రామయ్య, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రవి కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ ఏరుకొండ గణపతి, వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, సర్పంచ్‌లు జవహర్‌లాల్, గజ్జి రవి, కర్రె మంజుల అశోక్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సరిత, అనిత, మహేష్, పాల్గొన్నారు.

పల్లె ప్రగతి రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనం

మొగుళ్లపల్లి: తెలంగాణ పల్లె ప్రగతి రాష్ట్ర అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ మోటె ధర్మారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పల్లె ప్రగతి ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏదైనా గ్రామానికి రావాల్సి వచ్చినప్పుడు ఆ గ్రామంలోని సర్పంచ్‌కి ఫోన్ చేసి.. పరిస్థితి తెలుసుకుని సమస్య పరిష్కారం అయిన తర్వాత గ్రామానికి వెళ్లే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ఆ రోజుల్లో నీటి సమస్య అధికమని, భూగర్భ జలాలు అడుగంటి పోయిన పరిస్థితి ఉండేదని చెప్పారు. నేడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరు అందించి ఆడబిడ్డల కష్టాలు తీర్చిన భగీరథుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరసింగరావు, వైస్ ఎంపీపీ రాజేశ్వర్ రావు, ఎంపీటీసీ వనిత పున్నం చందర్ రావు, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ వినోద్ కుమార్ వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీలను రద్దుచేయాలి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు
- గంట పాటు ధర్నా, రాస్తారోకో



ధర్నాలో మాట్లాడుతున్న సత్యనారాయణరావు

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లి (బి), చిట్యాల మండలంలోని కాల్వపల్లి వాగులలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి ఇసుక క్వారీలను రద్దుచేయాలని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ ఇసుక మాఫియాకు అండగా నిలుస్తున్న అధికార యంత్రాంగంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమ ఇసుక క్వారీలను రద్దు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అరికట్టాలని.. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరింతగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వైనాల రవీందర్, సాంబయ్య, సంపత్, కిరణ్, నరేందర్, కుమార్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

కలెక్టర్ భవేష్‌మిశ్రా



భూపాలపల్లి: అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి: జిల్లాలో రెండో విడత ఓటరు నమోదు కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఓటర్ జాబితాపై గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓటరు నమోదు కార్యక్రమంపై 25 ప్రశ్నలతో కూడిన ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించారు. ఈ క్విజ్ ద్వారా చాలామందికి సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు భారత ఎన్నికల కమిషన్ జూన్ 23న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తుందన్నారు. దీనికోసం సంపూర్ణ సమాచారంతో సిద్ధం కావాలని చెప్పారు. రెండవ విడత ఓటరు నమోదు కార్యక్రమం కోసం బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే జూన్ 23 నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికి కొన్ని మండలాల్లో చాలా తక్కువ మొత్తంలో ఇంటింటి సర్వే జరగడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బూత్ స్థాయి అధికారులను తహసీల్దార్లు ప్రతి రోజూ పర్యవేక్షించాలని, రోజూ ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఇంటింటి సర్వే నిర్వహించి పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న ఇళ్ల సంఖ్య, సర్వేచేసిన ఇళ్లు, కొత్తగా నమోదు చేయాల్సిన ఓటర్లు, శాశ్వతంగా తొలగించిన ఓటర్లు, డుప్లికేట్ ఓట్లు, ఓటరు కార్డులో సవరణలు మొదలగు అంశాలపై నివేదికలను ఈఆర్‌ఓ నెట్ ద్వారా సమర్పించాలన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా పకడ్బందీగా రెండో విడత ఓటరు జాబితా రూపకల్పన కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల ప్రస్తుత స్థితిగతులపై నివేదిక తయారు చేయాలని సూచించారు. ఓటరు జాబితా రూపకల్పనలో సర్వీస్ ఓటర్లు, తొలగించిన ఓటర్ల క్షేత్ర స్థాయి ధృవీకరణ, నూతన ఓటర్లకు ఓటరు కార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఓటరు జాబితాలో ఒక ఇంటిలో ఆరు కంటే అధికంగా ఓట్లు ఉంటే ప్రత్యేకంగా పరిశీలించి ధృవీకరించాలన్నారు. దివ్యాంగులు, సెక్స్ వర్కర్స్, ట్రాన్స్ జెండర్లకు ఓటు హక్కు కల్పన కోసం చేసిన ప్రత్యేక కార్యక్రమాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఆర్డీఓ శ్రీనివాస్, ఆరు మండలాల తహసీల్దార్లు, డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గిరిజన భవనానికి శంకుస్థాపన



భూపాలపల్లి రూరల్: కృష్ణకాలనీలో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి రూరల్: ఈనెల 17న శనివారం భూపాలపల్లి జిల్లాలో గిరిజన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు.. అందుకు అవసరమైన ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాకేంద్రంలోని కృష్ణ కాలనిలో గిరిజన భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 17న నిర్వహించు గిరిజన ఉత్సవ కార్యక్రమం సందర్భంగా గిరిజన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. గిరిజన భవన నిర్మాణానికి ప్రభుత్వం కృష్ణ కాలనీలో సర్వే నంబరు 252లో ఒక ఎకరం స్థలం కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని చదును చేయాలని, ఎత్తుపల్లాలు లేకుండా మట్టి పోయాలని అధికారులకు సూచించారు. గిరిజన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి అనంతరం అక్కడే గిరిజన నాయకులు, ఉద్యోగులు, ప్రజలు దాదాపు 600మందితో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ సీఈఓ రఘువరన్, భూపాలపల్లి తహసీల్దార్ ఇక్బాల్ సింగరేణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సరుకుల నాణ్యతలో రాజీలేదు..

ఏటూరునాగారం: ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లకు సరఫరా చేసే నిత్యావసర సరుకుల నాణ్యతలో రాజీ పడేది లేదని, మేలు రకం సరుకులను మాత్రమే దిగుమతి చేసుకోవాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం అన్నారు. మండల కేంద్రంలోని జీసీసీ డీఎం కార్యాలయంలో ఆన్‌లైన్ టెండర్ల ద్వారా నిత్యావసర సరుకులు ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్, కళాశాలలకు పంపించే వ్యాపారులు ఇచ్చిన నమూనాలను కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీడీ పోచం మాట్లాడుతూ ఆన్‌లైన్ టెండర్ల ద్వారా టెండర్ దాఖలు చేసిన వ్యాపారస్తులు ఇచ్చిన శాంపిల్స్‌ను పరిశీలించామన్నారు. ఐటీడీఏ పీఓ అంకిత్ ఆదేశాల మేరకు నాణ్యమైన సరుకులను పరిశీలించి ఎంపిక చేసిన తర్వాత ధరలను నిర్ణయిస్తామన్నారు. నాణ్యతతో కూడిన సరుకులు సకాలంలో సరఫరా చేసే వ్యాపారులకు కమిటీ తీర్మానం మేరకే బాధ్యతలు అప్పగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఏటీడీఓ దేశిరాం, మేనేజర్లు శ్రీనివాస్, దేవ్, సమ్మయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ సంకీర్త్

ఏటూరునాగారం: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీలను ఏఎస్పీ సంకీర్త్, ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీలు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడాకారులు సన్మార్గం వైపు నడవాలని సూచించారు. పోలీసు శాఖలో చేరేందుకు యువత ముందుకు రావాలన్నారు. పోలీసుగా ఉద్యోగం పొందాలనుకునే వారికి తాము సహకరిస్తామన్నారు. ఈ క్రీడా పోటీల్లో విజేతలను జిల్లా స్థాయికి పంపిస్తామన్నారు. పోటీలు విజయవంతం అయ్యేందుకు క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, పీఈటీలు సహకరించాలన్నారు. ఈ పోటీలకు 16 వాలీబాల్ జట్లు హాజరయ్యాయని తెలిపారు. ఇందులో మొదటి విజేతకు నగదు బహుమతి కింద పోలీసుశాఖ రూ. 5వేలు, ఇర్సవడ్ల వెంకన్న రూ. 5వేలు, జెడ్పీ చైర్మన్ జగదీశ్ జ్ఞాపకార్థం రూ. 5వేలు జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అందించనున్నారు. వహీద్ ద్వితీయ బహుమతి కింద రూ.3వేలు అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం(కె) జెడ్పీటీసీ పాయం రమణ, సీఐ రాజు, ఎస్సై శ్రావణ్‌కుమార్, ఏఎస్సై సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న, ఎంఈఓ సురేందర్, పీఈటీలు పర్వతాల కుమారస్వామి, స్వరూప, దనసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం..

- రూ.2.50 లక్షలు నష్టపోయిన బాధితుడు
- మరో పది మంది కూడా ..
- రూ. 6 లక్షల వరకు నష్టపోయినట్లు సమాచారం




మహబూబాబాద్ రూరల్ : సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు రూపొందించినా కేటుగాళ్లు మారడం లేదు. వివిధ మార్గాల్లో మోసాలను కొనసాగిస్తూనే ఉన్నారు. బ్యాంకు ఖాతా అప్‌డేట్ చేసుకోమనో.. ఏటీఎం పిన్ నంబర్ మార్చాలి.. ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పమనో అమాయకులను వివిధ రూపాల్లో దోచుకుంటూనే ఉన్నారు. ఫలితంగా రోజూ ఏదో చోట పలువురు సైబర్ మోసాల బారిన పడుతున్నారు. తాజాగా మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడెం తండా గ్రామానికి చెందిన లావుడ్య మనోహర్ ఆన్‌లైన్ మోసంలో చిక్కుకుని రూ.2.50 లక్షలు నష్టపోయాడు. మనోహర్ ఆన్‌లైన్‌లో చైనా యాప్ ద్వారా వివిధ వస్తువులు కొనుగోళ్లు చేయడంతోపాటు పెట్టుబడి కూడా పెట్టాడు. అవతలి వ్యక్తులు పలుమార్లు ఇతడికి మేలు చేసి చూపించారు. కొంత పెట్టుబడి పెట్టగా కమీషన్ రూపంలో మరికొంత మొత్తాన్ని ఆన్‌లైన్ ఖాతాదారుడికి చెల్లించారు. దీంతో మనోహర్ కమీషన్ మరింత వస్తుందని నమ్మి అధిక మొత్తంలో లావాదేవీలు జరుపగా రూ. 2.50 లక్షల వరకు నష్టపోయాడు. దీనిపై సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అదే విధంగా కొమ్ముగూడెంకు చెందిన మరో పది మంది కూడా చైనా యాప్‌లో పెట్టుబడి పెట్టి కనీసం వస్తువు కూడా పొందకుండానే రూ. 6 లక్షల వరకు నష్టపోయి మోసపోయినట్లు తెలిసింది.

అన్నదాతలు..అప్రమత్తం

- నకిలీ విత్తనాలను గుర్తించకపోతే నష్టం
- దిగుబడిలో విత్తన నాణ్యత కీలకం
- డూప్లికేట్ సీడ్స్‌ను ఇలా గుర్తించాలి : శాస్త్రవేత్తలు





కరీమాబాద్ : అన్నదాతలు కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో నకిలీ విత్తనాల బెడద వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పత్తి, మిరప, వరి, మొక్కజొన్న విత్తనాలలో ఏది నాణ్యమైందో.. ఏది నకిలీదో తెలియని స్థితిలో గందరగోళానికి గురవుతున్నారు. ఎక్కువ దిగుబడి వస్తుందంటూ దళారులు మాయమాటలతో ఊరు పేరు లేని విత్తనాలను అంటగడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. విత్తన ఎంపిక, నకిలీని గుర్తించడంలో అవగాహన ఉండాలని పేర్కొంటున్నారు.

నకిలీ విత్తనం అంటే..

విత్తన ధ్రువీకరణ సంస్థ నుంచి అనుమతి లేని గింజలను నకిలీ విత్తనాలుగా పరిగణిస్తారు. అంతే కాకుండా ఎలాంటి అడ్రస్ లేకుండా అక్రమంగా అమ్ముతున్న విత్తనాలను కూడా నకిలీగానే భావించాలి. వాణిజ్య పరీక్షల నుంచి చోరీకి గురైన విత్తనాలు, నకిలీ ప్యాకింగ్ చేసి అమ్ముతున్న విత్తనాలు, లైసెన్స్ లేకుండా అమ్ముతున్న డీలర్ల వద్ద లభించే విత్తనాలను కూడా నకిలీగానే గుర్తించాలి.

నకిలీ విత్తనాలను గుర్తించడం రెండు రకాలు..

నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందులో ఒకటి పంట వేయక ముందు, రెండోది పంట వేసిన తర్వాత. అయితే పంట వేయక ముందే నకిలీదని గుర్తిస్తే రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండొచ్చు. పంట వేసిన తర్వాత గుర్తించినా లాభం ఉండదు. అందుకే రైతులు విత్తనాలు ధ్రువీకరించుకున్న తర్వాతనే నాటుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

1. విత్తనం నాటక ముందు..

- ప్రభుత్వ లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనాలి.
- విత్తన ప్యాకెట్లపై కంపెనీ హోలోగ్రాం సరి చూసుకోవాలి.
- తక్కువ ధరకు వస్తున్నాయని మూట కట్టిన విత్తనాలను కొనొద్దు.
- రైతులు రశీదు(బిల్లు)లు తప్పకుండా తీసుకోవాలి.
- విత్తన బ్యాగు వెనక పచ్చరంగులో ఉంచిన స్టిక్కర్ లేదా ట్యాగ్ ఉందో లేదో చూసుకోవాలి. ట్రూత్‌ఫుల్లీ విత్తనం అయితే 'పచ్చ రంగు' ధ్రువీకరణ పొందిన విత్తనమైతే 'నీలి రంగు' ట్యాగ్‌లుంటాయి.
- విత్తన ట్యాగ్‌లపై కంపెనీ లైసెన్స్ నంబర్, లాట్ నంబర్, క్యూఆర్ కోడ్‌తోపాటు వ్యాలిడిటీ డేట్ కూడా చూసుకోవాలి.

2. పంట కాలంలో అయితే..

- విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడం
- మొలకెత్తిన మొక్కలు ఎత్తుగా పెరగకపోవడం
- పూర్తిస్థాయిలో పూత రాకపోవడం
- వచ్చిన పూత రాలిపోవడం, కాయలుగా మారకపోవడం వంటి లక్షణాలు పంట సమయంలో గుర్తించొచ్చు.

దిగుబడిలో విత్తన ఎంపికే కీలకం..



పంటల దిగుబడి విషయంలో విత్తనాల ఎంపిక కీలకం. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లైసెన్స్, క్యూఆర్ కోడ్, ప్యాకింగ్ డేట్, వ్యాలిడిటీ డేట్ చూసుకోవాలి. తక్కువ ధరకు వస్తున్నాయని విడి విత్తనాలు కొనొద్దు. రంగుల కవర్లలో ప్యాక్ చేసి అమ్ముతున్న విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

డాక్టర్ రాజు, సమగ్ర సస్యరక్షణ శాస్త్రవేత్త

బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



మహమ్మద్ ఇష్హాల్ అహ్మద్ మృతదేహం

రఘునాథపల్లి : కారు అతివేగం ఒకరి ప్రాణాన్ని బలిగొనగా, మరో ముగ్గురిని గాయాలకు గురిచేసింది. ఈ ఘటన హన్మకొండ, హైదరాబాద్ జాతీయ రహదారిపై నిడిగొండ బ్రిడ్జి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కేశిరెడ్డి యోగేశ్వర్‌రెడ్డి తన కారులో హైదరాబాద్‌లో నలుగురు ప్రయాణికులకు ఎక్కించుకొని హన్మకొండకు బయలుదేరాడు. ఈక్రమంలో నిడిగొండ బ్రిడ్జి వద్ద అతివేగంగా వచ్చి అదుపు తప్పి రక్షణ గోడకు ఢీకొన్నాడు. దీంతో డ్రైవర్ సీటు వెనక కూర్చున్న హన్మకొండకు చెందిన మహమ్మద్ ఇష్హాల్ అహ్మద్ (43) అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ముగ్గురు తాటికొండ నవీన్, కురిమిల్ల అనూష, ఝెుర్ర అవినాశ్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్ యోగేశ్వర్ రెడ్డి ప్రమాదం నుంచి బయటపడి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను 108లో జనగామ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతివేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి మహమ్మద్ ఖాజా అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

కూతురికి మానసిక వ్యాధి..

- తమను రక్షించాలని తల్లి పోలీసులకు ఫిర్యాదు
- వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎంకు తరలింపు

హసన్‌పర్తి: కూతురు మానసిక ప్రవర్తనతో ఇబ్బందులు పడుతున్నామని, ఆమె నుంచి తమను రక్షించాలని కోరుతూ తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన క్రిష్టాది లక్ష్మికి ఇద్దరు కూతురులు ఉన్నారు. ఇందులో పెద్ద కూతురు రాజేశ్వరి(42) 28 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. రోజురోజుకూ ఆమె ప్రవర్తనలో మార్పు వస్తోంది. ఈ కారణంగా కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లిపై కూడా భౌతిక దాడులకు పాల్పడుతోంది.అలాగే, రాత్రి వేళల్లో గది తలుపులు వేసుకుని భయంకరంగా అరుస్తూ ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిపై స్పందించి తమ కూతురు నుంచి కాపాడాలని తల్లి కోరగా ఆమె ఫిర్యాదు మేరకు రాజేశ్వరిని వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

పరువు తీస్తున్నారని.. వ్యక్తి ఆత్మహత్య



రాములు(ఫైల్)

ఐనవోలు: కుటుంబ సభ్యులే తన పరువు తీస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నాగపురంలో జరిగింది. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం ఐనవోలు గ్రామానికి చెందిన ఆవునూరి రాములు(52) కుల వృత్తి కుమ్మరి పనితోపాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన రాములు.. నిత్యం తన భార్య, కుమారులతో గొడవ పడుతున్నాడు. కుమారులకు పెండ్లిళ్లు అయినప్పటికీ ఉమ్మడిగానే ఉంటున్నారు. తరచూ కోడళ్ల ఎదుట తన పరువు తీస్తున్నారని మనస్తాపానికి గురైన రాములు గురువారం నాగపురం వద్ద ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటువైపు వెళ్తున్న ఒంటిమామిడిపల్లికి చెందిన వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వర్ధన్నపేటకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు నరేశ్, సురేశ్ ఉన్నారు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏడునూతులలో వివాహిత ..



శోభారాణి(ఫైల్)

కొడకండ్ల : ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఏడునూతులలో జరిగింది. గ్రామానికి చెందిన బోల్లోజు శోభారాణి(32), వెంకటాచారి దంపతులు. వీరు బుధవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలకు హాజరై వచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం దంపతుల మధ్య గొడవ జరిగి భర్త బయటకు వెళ్లగా శోభారాణి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. శోభారాణి మృతికి గల కారణాలు తెలియలేదు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వెంకటాచారి కులవృత్తి, (వడ్రంగి) శోభారాణి టైలర్ పని చేసుకొంటూ కొడుకు, కుమార్తెతో కలసి జీవనం కొనసాగిస్తున్నారు.

కొడిశలకుంటలో మహిళ..

ములుగు రూరల్: కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం చెందారు. ఈ ఘటన మండలంలోని కొడిశలకుటంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొడిశల కుంటకు చెందిన పోరిక సంతోష్, కవిత (28) దంపతులు. వీరికి కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేశారు. అయినప్పటికీ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో కవిత గురువారం ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆత్మహత్య కేసులో ఐదుగురి అరెస్టు

కేసముద్రం: మండలంలోని ధర్మారం తండా జీపీ శివారు వెంక్యాతండాకు చెందిన బానోతు అశోక్.. తన భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మే 30న మృతి చెందాడు. ఈ ఘటనలో అత్తింటికి చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ మండలం ముత్యాలమ్మతండాకు చెందిన మృతుడి మామ వాంకుడోతు ఆనంద్, అత్త సత్రి, భార్య బేబి, మరిపెడ మండలం కొత్తతండాకు చెందిన తోటిఅల్లుడు భుక్యా నరేశ్, వదిన రజితను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి



భాగ్యమ్మ(ఫైల్)

డోర్నకల్ : వడదెబ్బకు గురైన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని ఉయ్యాలవాడకు చెందిన పగిడిపాల భాగ్యమ్మ(65) ఇటీవల ఎండకు అస్వస్థతకు గురై చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందింది.

పాద రక్షలు లేకుండా..దీక్ష



పాద రక్షలు లేకుండా నడుస్తున్న గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

కొత్తగూడ: : కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ మంత్రి సత్యవతిరాథోడ్ ఆరునెలలుగా కాళ్లకు చెప్పులు వేసుకోకుండా కఠోర దీక్ష చేపడుతున్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెం గ్రామంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో మండుటెండలో గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖామాత్యులు సత్యవతి రాథోడ్ నడిచారు. ఇప్పటికే ఆమె కాళ్లకు బొబ్బలు వచ్చాయి. అయినా దీక్షను విరమించకుండా పాద రక్షలు లేకుండానే నడుస్తున్నారు.

శభాష్.. వెంకటయ్య



సీపీఆర్ చేసిన అనంతరం శివరామయ్యతో హోంగార్డు వెంకటయ్య

రామన్నపేట: ట్రాఫిక్ హోంగార్డు..సీపీఆర్ చేసి ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడాడు. ఈ ఘటన గురువారం వరంగల్ నగరంలో చోటుచేసుకుంది. వరంగల్ హెడ్ ఆఫీసు సమీపంలో కడప జిల్లా బద్వేల్‌కు చెందిన పల్లెపు శివ రామయ్య అనే వ్యక్తికి ఒక్కసారి గుండె పోటు రావడంతో రోడ్డుపై పడిపోయాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు వెంకటయ్య వెంటనే అతని వద్దకు చేరుకొని సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. వెంటనే అతడిని మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన హోంగార్డు వెంకటయ్యను అధికారులు అభినందించారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరాకాలనీకి చెందిన పత్తి శ్రీకాంత్‌పై దాడి చేసి గాయపర్చిన ఘటనలో అతడి భార్య చందన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై వి.దీపికా రెడి గురువారం తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పత్తి శ్రీకాంత్‌పై వారి బంధువులు పత్తి మాధవి, శ్రీధర్, శ్రీహరి, శ్రీరాం, ప్రమీల, శివాని దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కాగా, బంధువుల నుంచి తమకు ప్రాణభయం ఉందని చందన టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

రాష్ట్రంలో ప్రగతి పరుగులు



కడవెండిలో సభలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో కలెక్టర్ శివలింగయ్య, తదితరులు

'పల్లెప్రగతి'తో మారిన గ్రామాల స్వరూపం

- ఉద్యమవీరుల స్ఫూర్తితో కడవెండి రుణం తీర్చుకుంటా
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రూ.4.41కోట్ల పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ

దేవరుప్పుల : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతి పరుగులు తీస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం కడవెండిలో నిర్వహించిన 'పల్లె ప్రగతి దినోత్సవ' కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన 1851 జీపీలు 'పల్లెప్రగతి' పనులతో సమగ్రాభివృద్ధి చెందాయని, తెలంగాణ ఓడీఎఫ్ రాష్ట్రంగా ఘనత సాధించిందని చెప్పారు. తాగు, సాగు నీటి కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మహిళలకు వెసులుబాటు, భూమికి ధర పెరిగి అన్నదాతల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. పొన్నాల లక్ష్మయ్య మంత్రిగా ఉన్న సమయంల ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరిస్తే తాను సమగ్రాభివృద్ధికి కృషి చేసినట్లు ఎర్రబెల్లి పేర్కొన్నారు. ఉద్యమాల గడ్డ కడవెండి రుణం తీర్చుకోవడానికి 'పల్లెప్రగతి' దినోత్సవం కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. చైతన్యవంతమైన ప్రజలు విపత్కర పరిస్థితుల్లోనూ మూడు దఫాలుగా ఆశీర్వదించడంతో నేడు మంత్రిగా రాణించగలుగుతున్నానని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఐఎస్ఓ సర్టిఫికెట్లకు ఎంపికైన జీపీల సర్పంచ్‌లు పోతిరెడ్డి బెల్లీనా(కడవెండి), యాకంతారరావు(పాలకుర్తి) తోపాటు కొడవటూరు, చిన్నపెండ్యాల జీపీలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అలాగే జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కింద రూ.4కోట్ల 40 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు అందజేశారు. డీపీఓ రంగాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌డీఓ రామిరెడ్డి, డీఈఓ రాము, ఎంపీపీ బస్వ సావిత్రి, వైస్‌ఎంపీపీ విజయ్, ఎంపీటీసీ కవిత, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, ఉపసర్పంచ్ నగేష్, విద్యాసాగర్, వీరాచారి, సోమయ్య, దయాకర్, బస్వ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ర్యాలీ అనంతరం నూతన జీపీ భవనం, పాలసేకరణ కేంద్రాన్ని, పాఠశాలలో డైనింగ్ హాల్, డిజిటల్ క్లాస్ గదిని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు.

'పెరుమాండ్ల'కు పెంపు లేనట్లే..!

- ఈ నెల 21తో ముగియనున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ పదవి కాలం
- ఖాళీ చైర్మన్ స్థానానికి ఇంటర్వ్యూ
- ఇద్దరు రిటైర్డ్ ఇంజనీర్లు హాజరు
- ఆ ఇద్దరిలో ఎవరిని వరించేనో..



సీజీఆర్ఎఫ్ కార్యాలయం

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్-1) వరంగల్ చైర్మన్ పెరుమాండ్ల సత్యనారాయణ పదవీకాలం పెంపు లేనట్లేనని తేలిపోయింది. ఈ నెల 21తో మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్న ఆయన.. మరికొంత కాలం చైర్మన్‌గా కొనసాగేందుకు ప్రయత్నాలు చేశారు. తనకున్న పరిచయాల ద్వారా పదవి కాలపరిమితి పొడిగింపునకు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కాగా, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీఎస్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో రెండు సీజీఆర్ఎఫ్‌లను ఏర్పాటు చేసింది. సీజీఆర్ఎఫ్-1 వరంగల్ కేంద్రంగా, సీజీఆర్ఎఫ్-2 నిర్మల్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సీజీఆర్ఎఫ్-1 ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో పని చేస్తుంది. నిర్మల్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సీజీఆర్ఎఫ్-1 ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పని చేస్తుంది. టీఎస్ ఎన్పీడీసీఎల్ ద్వారా సేవలు అందడంలో ఆలస్యమైనా, సౌకర్యాలు కల్పించకపోయిన, విద్యుత్ సర్వీస్‌ల మంజూరు, ఆలస్యం వంటి సమస్యలను వినియోగదారులు సీజీఆర్ఎఫ్‌లో ఫిర్యాదు చేసి పరిష్కరించుకునేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశారు.

మే 29న చైర్మన్ పదవికి ఇంటర్వ్యూ..

ప్రస్తుత వరంగల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ పెరుమాండ్ల సత్యనారాయణ 2020 జూన్ 22న బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల కాల పరిమితితో టీఎస్ ఈఆర్‌సీ అప్పట్లో సత్యనారాయణను చైర్మన్‌గా నియమించింది. పదవీకాలం సమీపించడంతో మే 29న చైర్మన్ పదవికి ఇంటర్వ్యూ నిర్వహించడంతో సత్యనారాయణకు పొడిగింపు దారులు మూసుకుపోయాయి. దీంతో త్వరలో కొత్త చైర్మన్ రానున్నారు. ఈ నెల 29న ఇంధన శాఖ, టీఎస్ ఈఆర్‌సీ నిర్వహించిన ఇంటర్వ్యూకు ఇద్దరు రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు హాజరయ్యారు. వీరిలో ఒక్కరికి సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా అవకాశం దక్కనుంది. టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్‌గా పని చేసి రిటైర్డ్ అయిన ఇ.నారాయణ, కమర్షియల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పని చేసి రిటైర్డ్ వేణుగోపాలచారి ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వీరిద్దరిలో ఒక్కరిని సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా నియమించే అవకాశముంది. ఈ నెల 21తో ప్రస్తుత చైర్మన్ సత్యనారాయణ పదవీ కాలం ముగియనుండడంతో ఈ లోపు నూతన చైర్మన్ నియామకానికి సంబంధించి ఉత్తర్వులు వెలువడే అవకాశముందని విద్యుత్ ఉద్యోగ వర్గాలు తెలిపాయి. కాగా, ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో ఒక్కరిని చైర్మన్‌గా నియమిస్తుందా లేదా ప్రస్తుత చైర్మన్ పదవీకాలం పొడిగిస్తుందా అనే విషయంపై ఉత్తర్వులు వెలువడితేనే స్పష్టత వస్తుంది.

ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలకు 19 చివరి తేదీ

ఐటీఐలో ట్రేడ్‌ల వివరాలు... (ఫీజు రూ.లలో)

ట్రేడ్	అర్హత	కాలవ్యవధి	సీట్లు	ఏడాదికి ఫీజు
డీజిల్ మెకానిక్	10వ తరగతి	1 సంవత్సరం	48	16,500
మోటారు మెకానిక్	10వ తరగతి	2 సంవత్సరాలు	24	16,500
వెల్డర్	10వ తరగతి	1 సంవత్సరం	20	16,500
పెయింటర్	10వ తరగతి	2 సంవత్సరాలు	40	16,5000

హన్మకొండ: వరంగల్ ములుగు రోడ్డులోని ప్రభుత్వరంగ సంస్థ టీఎస్ ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 19 తుది గడువుగా నిర్ణయించారు. అనుభవజ్ఞులైన, సుశిక్షుతులైన ఇన్‌స్ట్రక్టర్లతో అత్యుత్తమ విద్యా బోధన సాగుతోందని ప్రిన్సిపాల్ వంగాల మోహన్ రావు గురువారం తెలిపారు. సంస్థ డిపో గ్యారేజీలో అత్యాధునిక టెక్నాలజీ ఇంజిన్ (బీఎస్-6) వంటి బస్సులపై ఉత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రాజెక్టర్ ద్వారా పాఠ్యాంశాల బోధన, కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. ఇదే సంస్థలో అప్రెంటీస్ సౌకర్యం కల్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9849425319, 8008136611 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దత్తత గ్రామాల్లో పనులు పూర్తి చేయాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ గోపాల్ రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ గోపాల్ రావు

హన్మకొండ: విద్యుత్ అధికారుల దత్తత గ్రామాల్లో పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీ డీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్ఈలు, డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీఎస్ ఐపాస్, హెచ్‌టీ సర్వీస్‌ల మంజూరులో జాప్యం లేకుండా రిలీజ్ చేయాలన్నారు. కాలిన, పనిచేయని మీటర్లను మార్చాలన్నారు. రెండు సంవత్సరాలు పైబడిన వర్క్ ఆర్డర్లను పూర్తి చేయాలన్నారు. రూ.50,000 పైబడిన బకాయిని వసూలు చేయాలన్నారు. 33/11 కేవీ అంతరాయాలు తగ్గించి ఫీడర్లపై ఓవర్ లోడ్ భారం పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు లైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, డీఈ (ఐటీ) అనిల్ కుమార్, సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలు పాల్గొన్నారు.